# సాక్షి ములుగు

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025






**కుర్చీ మీద ప్రేమతోనే హిందూ నినాదం**

- 8లో

కుర్చీ మీద ప్రేమతోనే బీజేపీ హిందూ నినాదం ఎత్తుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.



**'ఓరుగల్లు'కు బీజేపీ మొండిచెయ్యి**

- 8లో

బీజేపీ రాష్ట్ర కమిటీలో ఈసారి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కరికి కూడా చోటుదక్కలేదు.

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం $32.0^0 / 23.0^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేడు, రేపు ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు

**వెంకటాపురం(ఎం):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) మండల స్థాయి క్రీడలను మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల సెక్రటరీ బల్గూరి వేణు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఈటీలు, పీడీలు ఎంఈఓలతో సమన్వయం చేసుకొని క్రీడలు నిర్వహించాలని సూచించారు. మండల స్థాయి అనంతరం జిల్లా స్థాయి క్రీడలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

### బీఆర్‌ఎస్ నేతల భిక్షాటన



**ములుగు:** మున్సిపల్ కార్మికుడు మహేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బులను మహేష్ కుటుంబానికి అందజేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, నాయకులు చెన్న విజయ్, వేములపల్లి భిక్షపతి, విజయ్‌రాంనాయక్, సమ్మయ్య, మహేష్, చంద్రమౌళి, సాగర్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్తగా పోడు చేస్తే చర్యలు



**మంగపేట:** కొత్తగా పోడు చేసిన, గుడిసెలు వేసిన చర్యలు తప్పవని డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని మంగపేట సమీపంలోని సంద్రోనిబర్రె అటవీ ప్రాంతంలోని శాంతినగర్ గొత్తికోయ గూడెంలో గిరిజనులకు ఎస్సై టీవీఆర్ సూరీ ఆధ్వర్యంలో సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 4న గొత్తికోయ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో నూతనంగా గుడిసెలు వేస్తుండగా అటవిశాఖ అధికారులు దాడులు నిర్వహించి అడ్డుకుని కూల్చివేసిన విషయం తెలిసిందే. అటవీశాఖ చట్టాలు, విధివిధానాలపై గొత్తికోయ గిరిజనులకు అవగాహన కల్పించారు. అయితే తాము 15 ఏళ్ల క్రితం నుంచి సాగు చేసుకుంటున్నామని, ఆ భూముల్లో గుడిసెలు వేయకుండా అడ్డుకుంటే బతికేది ఎలా అని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు ఎల్‌పి ముత్యాలు, ఎస్ఎస్ ప్రసాద్, ఎండీ దావూద్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చిరంజీవి, నగేష్ పాల్గొన్నారు.

### ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



**ములుగు:** జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద జరిగే పనులను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో జరిగిన 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ములుగు మండలంలో ఈజీఎస్ కింద రూ.13.70 కోట్లతో చేపట్టిన 495 పనులు, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.94 కోట్లతో చేపట్టిన 45 పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈజీఎస్ పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఎఫ్ఏ, టీఏ, పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.97,960లు రికవరీకి ఆదేశించారు. ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ, ఏపీఓలు నారగోని సునిత, రాజు, ప్లాంటేషన్ మేనేజర్ కిషోర్‌కుమార్, డిస్ట్రిక్ విజిలెన్స్ ఆఫీసర్ బావుసింగ్, ఎస్ఆర్‌పీ స్వామి, టీఏ సదయ్య పాల్గొన్నారు.

# పరిష్కారం ఏదీ?

## గ్రీవెన్స్‌లో బాధితుల మొర

- ప్రజావాణిలో 49, ఐటీడీఏలో 16 వినతులు
- స్వీకరించిన కలెక్టర్ దివాకర, పీఓ చిత్రామిశ్రా
- సత్వరమే పరిష్కరించాలని ఆదేశం



ములుగు రూరల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర

**ములుగు రూరల్:** ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లు రాలేదని ఒకరు, పింఛన్ మంజూరు చేయాలని వృద్ధుడు, ఉపాధి కల్పించాలని మరొకరు.. ఇలా జిల్లా వ్యాప్తంగా పలువురు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి కలెక్టర్ దివాకర దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 49 దరఖాస్తులు రాగా ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం కలెక్టర్ దివాకర మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను సత్వర పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కాని దరఖాస్తులు అర్జీదారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీఓ వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

**శాఖల వారీగా దరఖాస్తులు ఇలా..**

ప్రజావాణిలో మొత్తం 49 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణ శాఖ 13, భూ సమస్యలు 10, పెన్షన్ 9, ఉపాధి కల్పన 2, ఇతర శాఖలకు సంబంధించినవి 15 దరఖాస్తులు వచ్చాయి.

### గిరిజన దర్బార్‌లో..

**ఏటూరునాగారం:** గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమర్పించిన వినతులను పరిశీలించి వాటికి పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపడుతామని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం 16 మంది గిరిజనుల నుంచి వినతులను స్వీకరించారు. ఏటూరునాగారం మండలం ఎస్టీ నాయకపోడు చెందిన గిరిజనులమని, గోదావరి నది ప్రాంతానికి దగ్గర ఉండడంతో వరదలు వస్తే ఇళ్ల ఖాళీ చేయాల్సి వస్తోందని, తమకు ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వెంకటాపురం(కె) మండలం సీతారాంపురం గ్రామంలో రోడ్డు, పూసూరు వాగుపై కాజ్‌వే నిర్మించి రవాణా మార్గం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఏటూరునాగారం మండలం లంబాడీతండాకు చెందిన గిరిజనుడు ఈఎస్ఎస్‌లో మంజూరు అయిన కెనరా బ్యాంక్‌లో సబ్సిడీ జమ అయిన డబ్బులను ఇవ్వడం లేదని, వాటిని ఇప్పించాలని పీఓకు మొరపెట్టుకున్నారు. కన్నాయిగూడెం మండలం సర్వాయిగ్రామంలో సమ్మక్క సారలమ్మ గుడి వెళ్లే దారిని మరమ్మతు చేయాలని విన్నవించారు. తాడ్వాయి మండలం ఒడ్డుగూడెంలో త్రీఫేజ్ కరెంటు, వ్యవసాయ పంటలకు బోర్లు మంజూరు చేయాలని గిరిజనులు కోరారు. ఇలా పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని పీఓకు విన్నవించారు. వినతులు పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజ్‌కుమార్, ఎస్ఓ సురేష్‌బాబు, జీసీసీ డీఎం వాణి, డీటీలు కిషోర్, అనిల్, ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న గిరిజన మహిళలు

### ఇందిరమ్మ బిల్లు ఇప్పించరూ..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నా.. ఇప్పటి వరకు మొదటి దశ బిల్లు మాత్రమే చెల్లించారు. ములుగు మండలంలోని జీవింతరావుపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇప్పటికీ గోడలు, స్లాబ్ వేసుకొని బిల్లు కోసం ఎదురుచూస్తున్నాం. రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో చెల్లించి ఆదుకోవాలి.

- మౌనిక , జీవింతరావుపల్లి, ములుగు

### పింఛన్ కోసం..



నాతోటి వారికి పింఛన్ వస్తుంది. నాకు రావడం లేదు. నేను ఇప్పటి చాలాసార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. అయినప్పటికీ మంజూరు కావడం లేదు. అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయింది. పెద్దసారును కలిసేందుకు వచ్చా.

- సాధు వెంకటయ్య, బండారుపల్లి, ములుగు

### ఉపాధి కల్పించండి..



నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఉపాధి అవకాశం కల్పించాలి. గతంలో న్యాక్ సంస్థలో పని చేసిన అనుభవం ఉంది. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో స్వీపర్ పోస్ట్ ఖాళీగా ఉందని తెలిసింది. ఉపాధి అవకాశం కల్పిస్తే కుటుంబాన్ని పోషించుకుంటా.

- బొల్లం లలిత, మహ్మద్‌గౌస్‌పల్లి, మల్లంపల్లి

# నాణ్యమైన విద్యనందించాలి

**కలెక్టర్ టీఎస్ దివాకర**

**ములుగు రూరల్:** గురుకుల పాఠశాలలు, ఆశ్రమ, మోడల్, కేజీబీవీ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, మోడల్, కేజీబీవీల్లో నిత్యం విద్యాశాఖ అధికారులు తనిఖీ నిర్వహించాలన్నారు. వార్డెన్ నుంచి డీఈఓ వరకు విధులు సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఏపీఓ వసంతరావు, డీఈఓ సిద్ధార్థరెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, గిరిజనశాఖ ఆర్సీఓ హరిసింగ్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సర్దార్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

**రేపు స్థానిక సంస్థల తుది ఓటరు జాబితా**

**ములుగు:** జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈనెల 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి వారితో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి మార్పులు, చేర్పుల అనంతరం తుది జాబితాను వెలువరిస్తామన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, డిప్యూటీ ఈఓ రాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాత్రలు మింగి విద్యార్థినికి అస్వస్థత




చికిత్స పొందుతున్న విద్యార్థిని సాయిప్రసన్న

**ఎస్ఎస్‌తాడ్వాయి:** మండలంలోని మేడారం ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని పారాసెటమాల్ మాత్రలు (ట్యాబెట్లు) మింగి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి... వెంకటాపురం మండలంలోని రామంజపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి సాయిప్రసన్నకు జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఇంటికి తీసుకెళ్లి వారం రోజుల క్రితం పాఠశాలకు తీసుకువచ్చారు. ఇన్ని రోజులు ఇంటి వద్ద ఏమి చేశావని హిందీ టీచర్ ఆమెను మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఎక్కువ మొత్తంలో జ్వరం ట్యాబెట్లు (పారాసెటమాల్) వేసుకుంది. గమనించిన పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది వైద్య చికిత్స కోసం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై హెచ్ఎం సాయిబాబను వివరణగా కోరగా విద్యార్థి సాయిప్రసన్నకు జ్వరం ఉండటంతో ఇంటికి వెళ్లి వచ్చిందని, తరగతి గదిలో కొంత మంది విద్యార్థినులను ఎఫ్ఏ మొదటి యూనిట్ పరీక్ష రాయలేదని, రెండో ఎఫ్ఏ యూనిట్ పరీక్ష ఎలా రాస్తారని టీచర్ ప్రశ్నించారు. అంతేగాని సాయిప్రసన్నను మందలించడం, తిట్టిందనే పుకార్లు అవాస్తవమన్నారు.

# చాట్‌బాట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**టీజీ ఎన్పీడీసీఎల్ డీఈ నాగేశ్వరరావు**



**ములుగు:** విద్యుత్ వినియోగదారుల కోసం తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీజీఎన్పీడీసీఎల్) ఆధ్వర్యంలో వాట్సాప్ చాట్ బాట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ములుగు డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు స్మార్ట్‌ఫోన్ వాట్సాప్‌లో 7901628348 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపగానే వెల్‌కమ్ టు టీజీఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్ అని సందేశం అందుతుందన్నారు. వెంటనే రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ వంటి ఆప్షన్లు వస్తాయన్నారు. వినియోగదారులు యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేస్తే వెంటనే విద్యుత్ సర్వీస్ వివరాలు ప్రదర్శించబడతాయన్నారు. వివరాలను ఓకే చేసిన తర్వాత కంప్లైంట్‌కు సంబంధించిన విభాగాల మెనూ కనిపిస్తుందని, వినియోగదారుడు తాను ఎదుర్కొంటున్న సమస్యను ఎంచుకుని ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే సమస్య పురోగతి ట్రాక్ చేసుకోవచ్చని తెలిపారు. సమస్య పరిష్కారమైన తర్వాత వినియోగదారుడికి ఐవీఆర్ఎస్ కాల్ వస్తుంది. వినియోగదారుడు సంతృప్తి చెందనట్లయితే కంప్లైంట్‌ను మళ్లీ రీఓపెన్ చేసుకునే అవకాశం ఉంది. వినియోగదారుల సమస్యలను త్వరగా పరిష్కరించడం, సమయాన్ని ఆదా చేయడం, పారదర్శకతను కాపాడటం చాట్‌బాట్ ప్రత్యేకత అన్నారు. వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**ములుగు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత, దళిత రత్న నెమలి నర్సయ్య, జిల్లా ఇన్‌చార్జ్ చాతాల్ల రమేశ్ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి ర్యాలీగా వెళ్లిన నాయకులను, పెన్షన్‌దారులను కలెక్టరేట్ గేటు వద్దనే పోలీసులు నిలిపేశారు. దీంతో పోలీసులకు, ఎమ్మార్పీఎస్ నాయకుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఎమ్మార్పీఎస్ నాయకులు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు పెంచి ఇవ్వాలన్నారు. ఇప్పటికైన ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మంచోడు చంద్రమౌళి, తడుగుల విజయ, వెలుకుర్తి మోహన్‌రావు, మహాజన సోషలిస్టు పార్టీ నాయకుడు కల్లేపల్లి రమేశ్, వికలాంగుల కుల పోరాట సమితి నాయకులు దూడపాక రాజు, కొండి రమేశ్, గజ్జల ప్రసాద్, మరాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు



నెల్లుట్ల రమాదేవి

# మొదటి ప్రశంస కాళోజీదే

## నేను రాసి, చదివిన కవిత బాగుందని మెచ్చుకోవడం మరిచిపోలేని జ్ఞాపకం

- ఆయన పేరిట సాహితీ పురస్కారానికి ఎంపికైనందుకు సంతోషంగా ఉంది..
- అమ్మ ప్రోత్సాహంతో రచనలు.. భర్త సహకారం కొనసాగించేలా చేశాయి..
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కాళోజీ సాహితీ పురస్కారం–2025 గ్రహీత నెల్లుట్ల రమాదేవి

'ప్రజాకవి కాళోజీ నారాయణరావుతో పరిచయం ఉంది. మొదటి సారి 1990 హనుమకొండలో బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్న సమయంలో కాళోజీ నారాయణరావు ఇంట్లో మిత్రమండలి సమావేశం జరిగింది. ఆ సమావేశానికి వెళ్లిన నేను మొదటిసారి ఆయనను ప్రత్యక్షంగా చూశా. అప్పటికే ప్రజాకవిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా గొప్ప పేరుంది. ఆయన ముందు ధైర్యం చేసి నేను రాసిన ఒక కవితను చదివాను. దానికి కాళోజీ నన్ను అభినందించడం ఇప్పటికీ గుర్తు ఉంది.' అని అన్నారు తెలుగు కవయిత్రి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవి. ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కాళోజీ సాహితీ పురస్కారం–2025కు ఎంపిక చేసిన నేపథ్యంలో నేడు (మంగళవారం) కాళోజీ జయంతి సందర్భంగా సోమవారం 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఉద్యోగం చేస్తూనే ఆమె చేసిన రచనలు, రాసిన కథలు.. గీసిన కార్టూన్లు, కాళోజీతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

- సాక్షిప్రతినిధి, వరంగల్/స్టేషన్‌ఘన్‌పూర్

**విద్యార్థి దశనుంచే రచనలు.. అమ్మ ప్రోత్సాహం, భర్త సహకారం..**

1980లో తొమ్మిదో తరగతిలో స్నేహ అనే నాటిక రాశాను. అనంతరం మొదటగా బుజ్జాయి అనే పిల్లల పత్రికలో నేను రాసిన కథను ప్రచురించారు. ఈ తరం అమ్మాయి అనే కథను ఒక మహిళా మ్యాగ్జిన్‌కు వాడుకున్నారు. నా చిన్నప్పటి నుంచే మా అమ్మ శకుంతలాదేవి కథల పుస్తకాలు బాగా చదివేది. మాకు కథలు చెప్పేది. అలా కథల పుస్తకాలు చదువుతూ నేను కూడా కథలు రాయాలనుకున్నా. నన్ను మొదట ప్రోత్సహించింది మా అమ్మనే. అదేవిధంగా 1983లో వివాహం జరిగింది. భర్త దేవేందర్ జిల్లా కోఆపరేటివ్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసేవారు. ఆయన నన్ను బాగా ప్రోత్సహించేవారు. కథలు, రచనలకు, కార్టూన్‌లకు తన అభిప్రాయాలు, సూచనలు చేసేవారు. అయితే దురదృష్టవశాత్తు 2009లో ఆయన హఠాన్మరణం చెందడం బాధాకరం.



సినీనటి జమునతో నెల్లుట్ల రమాదేవి (ఫైల్)

**కాళోజీని చాలాసార్లు కలిసి మాట్లాడాను..**

నాతో కలిసి హనుమకొండలో బ్యాంకులో పనిచేసే రవికుమార్ కాళోజీ కుమారుడని తర్వాత తెలిసింది. రవికుమార్ పద్యాలు రాసేవారు. ఇద్దరం కవితలు, పద్యాలు ఒకరికొకరం చెప్పుకునేవాళ్లం. అతడితో కలిసి కాళోజీ ఇంటికి వెళ్లి ఆ మహానుభావుడితో చాలాసార్లు మాట్లాడాను. కాళోజీకి నేను రాసిన కథలు, రచనలు చూపించి సంతోషపడ్డాను. అనంతరం రెండు, మూడు సమావేశాల్లో కలుసుకున్నాం. కాళోజీ రచనలు చాలా చదివాను. ఆయన రచనలు సరళంగా ఉంటాయి. సమాజాన్ని సూటిగా ప్రశ్నించే ఆయన రచనలు అంటే చాలా ఇష్టం.

**ఆయన ధిక్కార స్వరం.. సమాజానికి దిక్సూచి..**

ఒక మనిషి, కవి, రచయిత ఎలా ఉండాలని సమాజానికి దిశానిర్దేశం చేయడమే కాకుండా స్వయంగా పాటించిన గొప్పవ్యక్తి కాళోజీ. ఆయన రాసిన పలుకుబడుల భాష–బడిపలుకుల భాషతోపాటు పలు రచనలు చదివాను. ధిక్కార స్వరం అయిన కాళోజీ తెలంగాణకే కాదు మొత్తం సమాజానికి దిక్సూచి. ఆయన ఏదైనా పద్యం చెబితే వాస్తవికంగా, సరళంగా ఉండేది. రచనలు, మాటలు సూటిగా, చురుకుమనిపించేలా ఉంటాయి. ఆయన పోయెట్రీ తెలంగాణకు దిశానిర్దేశం. తెలంగాణ రాష్ట్రంలో స్వేచ్ఛగా, సంతోషంగా ఉంటున్నామంటే ఆరోజుల్లోనే తెలంగాణ గురించి మాట్లాడి, కొట్లాడిన వ్యక్తి కాళోజీ ఒకధీరోదత్తుడు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి.. రమాదేవి**

నెల్లుట్ల రమాదేవి... తెలుగు కవయిత్రి, కథకురాలు, ఉపన్యాసకురాలు, కార్టూనిస్టు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ రైతు కుటుంబానికి చెందిన రాంచందర్‌రావు, శకుంతలాదేవి దంపతులకు జన్మించారు. 1983లో దేవేందర్‌ను వివాహమాడిన ఆమె 1984లో గ్రామీణ బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి ఆంధ్రా బ్యాంకు సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. కవి, రచయిత్రి, కార్టూనిస్టుగా రాణించిన రమాదేవి మొదటి కార్టూన్ 1978లో స్వాతిలో అచ్చయ్యింది. ఆ తర్వాత అనేక కథలు, కథానికలు ఆమెకు మంచి గుర్తింపు తేగా.. 2013 సంవత్సరానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తిపురస్కారం అందుకున్నారు. కథలు, కవిత్వమే కాకుండా కార్టూన్లు వేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా రమణీయమైన కావ్యాలు, మనసుకు హత్తుకునే భాషతో అందరినీ ఆకట్టుకున్న రమాదేవి కాళోజీ సాహితీ పురస్కారం –2025కు ఎంపికయ్యారు.

**సీరియస్, హాస్యం.. రెండూ ఉంటాయి..**

కాళోజీ మంచి జోకులు వేసేవారు. ఒక సమావేశంలో ఆయనను కలిసినప్పుడు బ్యాంకు క్యాషియర్‌నైన నన్ను కేవలం పైసలు లెక్కపెడ్తున్నావా? రచనలు చేస్తున్నావా? అంటూ హాస్యంగా మాట్లాడారు. రచయితలు రచనలు చేయాలని, సమాజానికి దిశానిర్దేశం చేసేలా, ప్రజలను చైతన్యం చేసేలా రచనలు ఉండాలని చెప్పేవారు.

**కాళోజీ పురస్కారం... మొదటి మహిళగా సంతోషంగా ఉంది..**

గత పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న కాళోజీ సాహితీ పురస్కారానికి ఈ ఏడాది మొదటి మహిళగా నేను ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. 2015లో అమ్మంగి వేణుగోపాల్ ఈ అవార్డుకు ఎంపిక కాగా, అనంతరం గోరటి వెంకన్న తదితర ప్రముఖులు అందుకున్నారు. గత ఏడాది నలిమెల భాస్కర్‌కు ఈ అవార్డు అందించారు. 11వ వ్యక్తిగా మొదటి మహిళగా, కాళోజీ పుట్టిన ఓరుగల్లు బిడ్డగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది.



## కాళోజీ.. ధిక్కారస్వరం

8లో

- పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబావుటా ఎగరేసిన అగ్నికణం
- కవితలతో ప్రజల్లో నిత్యం చైతన్యం నింపిన స్ఫూర్తి ప్రదాత
- అన్యాయాలను ఎదురిస్తూ ప్రజాస్వామ్య విలువలు బోధించిన శక్తి..
- నేడు కాళోజీ జయంతి, తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవం

- హన్మకొండ కల్చరల్

# ఉన్నట్టా.. లేనట్టా!

- నాలుగు రోజులుగా కనిపించని పెద్దపులి
- గాలింపు చర్యలు చేపడుతున్న ఫారెస్ట్ అధికారులు

**ములుగు:** జిల్లాలో ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా దర్శనమిచ్చిన పెద్దపులి జాడ దొరకడం లేదు. ఈనెల 3న ములుగు మండలంలోని పత్తిపల్లిలో పులి అడుగులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. 4న వెంకటాపురం(ఎం) మండలంలోని నర్సాపూర్ శివారులో పెద్దపులి అడుగులను గుర్తించిన అటవీశాఖ అధికారులు పాలంపేట వానగుట్ట వైపు వెళ్లినట్లు చెప్పారు. అప్పటి నుంచి పులి జాడ దొరకడం లేదు. అటవీశాఖ అధికారులు మాత్రం వానగుట్ట సమీపంలోనే ఉందని చెబుతున్నారు. రోజుకు 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు నడిచే పెద్దపులి వానగుట్ట సమీపంలోనే మకాం వేసి ఉందని చెబుతుండడం అనుమానాలకు తావిస్తోంది. గత సంవత్సరం డిసెంబర్ 10న గోదావరి దాటి జిల్లాలోకి ప్రవేశించిన బెంగాల్ టైగర్ వెంకటాపురం(కె) మండలంలోని బోదాపూర్ మీదుగా మల్లూరు గుట్టల వైపు వెళ్లినట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. 2025 మార్చి 7న వెంకటాపురం(ఎం) మండలంలోని లింగాపూర్ ప్రాంతంలో పులి సంచరించింది. ప్రతీఏటా పులులు జిల్లాలో సంచరిస్తున్నా..వాటికి భద్రత లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021లో జిల్లా కేంద్రం మీదుగా పులి చర్మాన్ని తరలిస్తున్న స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. 2022లో తాడ్వాయి మండలంలో వేటగాళ్ల ఉచ్చులకు గర్భంతో ఉన్న పులి (ఎస్–1) ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

**వానగుట్టలో వేటగాళ్ల ఉచ్చు..**

వానగుట్ట, వరాలగుట్ట ప్రాంతంలో అడవి పందుల కోసం వేటగాళ్లు ఉచ్చులు పెట్టినట్లు అనుమానాలున్నాయి. నాలుగు రోజులుగా పులి జాడ తెలవకపోవడంతో పాటు రైతులు, పశువుల కాపరులు పాదముద్రలు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందిస్తే తప్ప అధికారులు స్వచ్ఛందంగా తెలుసుకునే పరిస్థితి కనిపించడం లేదు. అక్రమ కలప రవాణా, ఇసుక రవాణాపై రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులకు జిల్లాలో సంచరిస్తున్న పులి ప్రయాణంపై సమాచారం లేకుండాపోయింది. పులి కోసం గాలిస్తున్నామని చెబుతున్నారే తప్ప పులి వానగుట్ట ప్రాంతంలో ఉందా.. ఇతర ప్రాంతానికి తరలివెళ్లిందా.. అనే పూర్తి వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం. పులి వేటగాళ్ల ఉచ్చులకు బలి కాకముందే గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, భద్రత చర్యలు చేపట్టాలని వన్యప్రాణుల ప్రేమికులు కోరుతున్నారు.



పత్తిపల్లిలో పులి పాదముద్రలు (ఫైల్)

## క్లుప్తంగా

### ట్యాంకర్ నుంచి ఆయిల్ లీక్

- రోడ్డుపై పల్టీలు కొట్టిన వాహనాలు
- 40 మంది వాహనదారులకు గాయాలు



**జనగామ:** జనగామ పట్టణం శ్రీవిల్లాస్ కాలనీ యూ టర్న్ నుంచి హైదరాబాద్ రోడ్డు అటవీ శాఖ కార్యాలయం వరకు సోమవారం హైవేపై ఓ ట్యాంకర్ నుంచి ఆయిల్ లీకై పడడంతో వాహనదారులు పల్టీకొట్టారు. సుమారు కిలోమీటర్ వరకు రోడ్డుపై ఆయిల్ పడడంతో బైక్‌లు, చిన్న వాహనాలు జారి పడగా వాహనదారులు గాయాల పాలయ్యారు. వెంటనే అప్రమత్తమైన ట్రాఫిక్ కానిస్టేబుళ్లు అజయ్, ఫయాజ్ రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా అక్కడే ఉండి పర్యవేక్షించారు. కాగా, సుమారు 40 మందికి పైగా గాయాలు కాగా, ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు.

### అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చిన మహిళ అరెస్ట్

**నర్సంపేట రూరల్ :** అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న నర్సంపేటకు చెందిన గుజ్జ సుజాతను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు టౌన్ సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన గుజ్జ సుజాత అధిక వడ్డీకి డబ్బులు అప్పుగా ఇస్తూ వారి వద్ద నుంచి అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందన్నారు. సుజాతపై నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయని, ఆమె ఇన్ని రోజులు తప్పించుకుని తిరిగిందన్నారు. ఈ క్రమంలో శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

### తాబేళ్ల కోసం వెళ్లి కుంటలో వ్యక్తి గల్లంతు

- రెస్క్యూ టీం గాలింపు.. లభించని ఆచూకీ



గల్లంతైన వెంకన్న


**కురవి:** తాబేళ్ల వేట కోసం కుంట వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన కురవి మండలం తిర్మలాపురం–నల్లెల్ల శివారులోని గణేశ్ కుంటలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లికుదురు మండలం వావిలాలకు చెందిన భూతం వెంకన్న కుటుంబంతో కలిసి కొన్నేళ్ల నుంచి కురవిలోని చెంచు కాలనీ వద్ద జీవిస్తున్నాడు. ఇదే కాలనీకి చెందిన బాజ వెంకన్నతో కలిసి ఆదివారం మధ్యాహ్నం గణేశ్ కుంట వద్దకు తాబేళ్ల కోసం వచ్చాడు. అనంతరం భూతం వెంకన్న ఇంటికి చేరుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న వెంకన్న భార్య రమణమ్మ కాలనీలోని పెద్దలకు చెప్పింది. భూతం వెంకన్న తన దుస్తులు, పర్సు, సెల్‌ఫోన్ తీసి కట్టపై పెట్టి కుంటలోకి దిగినట్లు అతడి వెంట ఉన్న బాజ వెంకన్న సోమవారం కాలనీ పెద్దలకు చెప్పగా వారు గణేశ్ కుంట వద్దకు వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే కురవి పోలీసులు, మానుకోట అగ్నిమాపక శాఖ ఎస్సై మోహన్‌రావు, సిబ్బంది గోపి, షఫీ, రమేశ్, రహీం ఘటనాస్థలికి చేరుకుని గజ ఈతగాళ్ల, రెస్క్యూ టీం సాయంతో కుంటలో గల్లంతైన వెంకన్న కోసం గాలించారు. సాయంత్రమైనా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాజ వెంకన్నను పోలీసులు విచారిస్తున్నారు. కాగా, భూతం వెంకన్న గల్లంతుతో భార్య రమణమ్మ తోపాటు కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపారు.



# కాళోజీ.. ధిక్కారస్వరం

## పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబావుటా ఎగరేసిన అగ్నికణం

- కవితలతో ప్రజల్లో నిత్యం చైతన్యం నింపిన స్ఫూర్తి ప్రదాత
- అన్యాయాలను ఎదురిస్తూ ప్రజాస్వామ్య విలువలు బోధించిన శక్తి..
- నేడు కాళోజీ జయంతి, తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవం



కాళోజీ నారాయణరావు (ఫైల్)

**హన్మకొండ కల్చరల్ :** పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు.. ధిక్కార స్వారానికి మారుపేరు. ప్రశ్నించేతత్వానికి చిరునామా. 'ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం.. ప్రాంతేతరులు దోపిడీ చేస్తే తన్ని తరుముతాం.. దోస్తుగ ఉండే వారితో మేమూ దోస్తే చేస్తం.. ప్రాణమిస్తం.. ఎంతకు అంత అన్న ధోరణితో చింతమాని బతుకు సాగిస్తం' అంటూ తన కవితల ద్వారా నిరంతరం పాలకులపై ధిక్కారస్వరం వినిపించేవారు. తెలంగాణ మాండలికంలో తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచేవారు.ఈక్రమంలో మంగళవారం కాళోజీ జయంతి, తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావుపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

### మానవత్వ విలువలు ప్రబోధించిన శక్తి..

మానవత్వ విలువలు ప్రబోధించిన శక్తి.. తన భావాలకే కాదు శరీరానికి మరణం లేదని నిరూపించిన వ్యక్తి పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు. 1914 సెప్టెంబర్ 9వ తేదీన రంగారావు, రమబాయి దంపతులకు కాళోజీ జన్మించారు. పూర్తి పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ. మడికొండలో ప్రాథమిక విద్య, హనుమకొండ, హైదరాబాద్‌లలో ఉన్నతవిద్యనభ్యసించారు. కాళోజీ పదిహేనేళ్ల వయసు నుంచే రాజకీయ ఉద్యమాలు, కవిత, రచనా వ్యాసంగాలలో మునిగిపోయారు. ఆర్య సమాజం, ఆంధ్రమహాసభ , నిజాంస్టేట్ కాంగ్రెస్‌లో సభ్యుడిగా ఉంటూ నైజాం వ్యతిరేకపోరాటంలో పనిచేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1958 నుంచి 1960 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా , ఆంధ్రసారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీల్లో సభ్యుడిగా, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, కాళోజీ సతీమణి రుక్మిణి కాళోజీ ఉద్యమాలు, అరెస్టుల నేపథ్యంలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకున్నారు.

### కాళోజీ అభిప్రాయాలు ...

**ఏకీభవించనోని పీక నొక్కుటే ఫాసిజం..**

శాంతిని అందరూ కోరుకుంటున్నట్లు మాట్లాడుతారు. శాంతిగా మెలగుటమంచిదే. కానీ శాంతి పరిస్థితి కలదా సఖుడా! అన్నది నా ప్రశ్న. 'శాంతి శాంతట శాంతి గుండె మండిపోతుంటే, కండ కరిగిపోతుంటే బతుకు చితికిపోతుంటే, ఎముక విరిగిపోతుంటే శాంతి శాంతట శాంతి'. హింస హింస అని వూరికే అంటుంటారు. నా దృష్టిలోనూ హింస తప్పు. రాజ్యహింస మరీ తప్పు. ప్రతి హింస తప్పుకాదు. ఏకీభవించనోని పీక నొక్కు సిద్ధాంతం అంటే మరేమిటోకాదు అచ్చమైన ఫాసిజం. నాగొడవలో హిరణ్యకశిపుడు అచ్చమైన ఫాసిస్టు ప్రహ్లాదుడు సత్యాగ్రహి, సత్యాగ్రహం వల్ల ఫాసిస్టుల్లో పరివర్తన జరగనప్పుడు నరసింహుల్లా ప్రతిహింస తప్పదు.

**అన్యాయాన్నెదిరించిన వాడే ఆరాధ్యుడు..**

మ్రోగుతున్న ప్రజల వాణి/ ఆగి మూగపోతున్నద?/ దోపిడీ పెత్తన్‌దారికి / తోడా? ఆ చావు కూడా/ ఎదిరించిన ప్రతీ వ్యక్తికి / ఈ వ్యవస్థలో అవస్థ/ రాజీపడు 'మేతావి'/ పాజీలకు మజామజా.. అన్యాయాన్నెదిరించిన/ వాడు నాకు ఆరాధ్యుడు/ పేరుకు బతికున్న ప్రభుత్వం/ పేరుకు చస్తున్న 'రాజు' / అన్నాయాన్నేదిరిస్తే నాగొడవకు సంతృప్తి / అన్యాయం అంతరిస్తే/ నాగొడవకు ముక్తిప్రాప్తి.

**ప్రశ్నించడం మానొద్దు..**

ప్రశ్నలడగడంలో నేనెప్పుడు ప్రథముడినే. 1946లో నైజాం రాజును అడిగా నేను అడగడం మాత్రం మానలేదు. నిజమైన కవి అన్నవాడు జనం కోసం న్యాయం అడుగుతాడు. ఎవరి పనుల్లో వారు మునిగిపోగుడదు. ఎవరి బాగు వాళ్లు చూసుకుంటూ కూర్చోకూడదు. నిలదీసి ప్రశ్నించినవారిని ప్రభుత్వం బందిస్తుంది. వాళ్లమీద కక్షగడుతుంది. అయినా ప్రభుత్వం చూపించే ఎరలకు లొంగిపోకూడదు. ఆలోచించాలి.. అడగాలి. ప్రశ్నలు అందరూ అడగాలి. చైతన్యం కలిగించాలి. తిరగబడాలి. ఎదురించాలి.

**రైతుబాధలు..**

రాణివాసములోన రంజిల్లు రాజా/ రైతు బాధలు తీర్చి రక్షించ లేవా/ పట్టణపు సొగసుకై పాటుపడు రాజా/ పల్లెకందము గూర్చు బాధ్యత తెలియదా?/ ప్రజలను హింసించు ప్రభువు మాకేల? / వధియించి భక్షించ వనరాజు లేడా?/ సామాన్య ప్రజలకు చైతన్య మొదవ/ చతురంగ బలముండ జంకేల రాజా?

**జాగ్రత్త..**

మనసు సంతలో బేరమాడబోకు/ బతుకు పెన్నిధిని గవ్వల కమ్మబోకు నిన్ను మించినదేమున్నది కోరుకొనగ/ ఆశనిరాశల వసతి మనసు కాగూడదెప్పుడు/ కలము గారడీ చేయకు కవితనెపుడు.

**నడత – నాణ్యం..**

దొంగవలె అందాల తొంగిచూచుట తప్పు/ ఆగుపడిన అందాన్ని అరయకుండుట తప్పు/ కనపడ్డ ప్రతీదాని కానపడుటయు తప్పు/ భంగపడి వాంఛలకు లొంగిపోవుట తప్పు/ కినుకతో మదిలోన కృంగిపోవుట తప్పు/ పైకి ప్రహ్లాదువలె పలుకుచుండుట తప్పు/ సహజ ప్రవృత్తులను చంపివేయట తప్పు/ సహజమని వృత్తుల చంకచేరుట తప్పు..

**స్వేచ్ఛ..**

బాధ్యత ఎరుగని స్వేచ్ఛ
బానిసత్వ లక్షణము
బాధ్యత ఎరిగిన స్వేచ్ఛ
స్వాతంత్రపు రక్షణము

**వ్యక్తిత్వం..**

'ప్రతివారికి వ్యక్తిత్వం ఉంటేనే పౌరత్వం
వ్యక్తిత్వం భద్రంగా ఉంటేనే వ్యక్తి బతుకు
వ్యక్తిత్వం భద్రంగా ఉంటేనే జాతి బతుకు'



భార్య రుక్మిణితో కాళోజీ(ఫైల్)

### నేడు తెలంగాణ భాషా దినోత్సవం..

కాళోజీ జన్మదినమైన సెప్టెంబర్ 9వ తేదీని తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవంగా జరుపుకోవాలని 2014 సెప్టెంబర్ 9న వరంగల్‌లోని నిట్ కళాశాలలో జరిగిన కాళోజీ నారాయణరావు 100వ జయంతి సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.

### ఉద్యమ ధ్వజం..

అక్షరాలను అగ్ని కణాలుగా
విరజిమ్మావు..
అఖిలాండంలోని అనాథలగాథలను
వినిపించావు
అణగదొక్క గర్జించావు
అధికారం ముసుగులో
కాళికవై కదిలావు
ప్రశ్నించేతత్వానికి ప్రహ్లాదుడే
గురువని ప్రవచించావు
ఉప్పెనలా ఎగిసిపడే ఉద్యమాలకెన్నిటికో
ఊపిరిగా నిలిచావు
ప్రజల భాషలో ప్రజల గొడవకు
పట్టం కట్టావు
నిర్మోహ్మాటం, నిజాయతీలనే
త్రికరణశుద్ధిగా పాటించావు
సామాన్యుడిగా ఉంటూనే సాహసంతో
సత్యాగ్రహిగా బతికావు
తెలంగాణ పోరు తేరుపై
'ఉద్యమ ధ్వజం'గా మిగిలావు



\- కాళోజీ జయంతి సందర్భంగా పాలకుర్తికి చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్. (9989148305)

-పాలకుర్తి టౌన్

### రెనోవా బన్ను ఆస్పత్రి ప్రారంభం

- సామాన్యులకు అందుబాటులో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అతిథులు

**ఎంజీఎం :** ప్రజలకు ప్రపంచ స్థాయి నాణ్యతతో క్యాన్సర్ చికిత్స అందించేందుకు రెనోవా బన్ను ఆస్పత్రిని ప్రారంభించినట్లు రెనోవా గ్రూపు ఆస్పత్రి ఫౌండర్ సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ములుగు రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రిని సోమవారం ఆరోగ్యవర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ నాగార్జునారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ ప్రాంతంలో తొలి సమగ్ర క్యాన్సర్ ఆస్పత్రిగా రెనోవా బన్ను ఆస్పత్రి నిలుస్తుందని తెలిపారు. ఈ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలైన దాదాపు రూ. 20 కోట్ల విలువైన హెల్‌కాయిన్ ఇమేజ్ గైడెడ్ రేడియేషన్, దాదాపు రూ.6 కోట్ల విలువైన పెట్ సిటీ పరికరాలతో అంతర్జాతీయ స్థాయి చికిత్స సదుపాయాలు వరంగల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

### పలు రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కొనసాగింపు

**కాజీపేట రూరల్ :** కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన తాత్కాలిక హాల్టింగ్‌లను కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు.

**హాల్టింగ్ స్టేషన్లు ఇవే..**

దానాపూర్–సికింద్రాబాద్ (12792) దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంట, నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్, నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్, పూణె–కాజీపేట (22151) ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల, కాజీపేట–పూణె (22152) ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

## కుర్చీ మీద ప్రేమతోనే బీజేపీ హిందూ నినాదం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

**హన్మకొండ:** కుర్చీ మీద ప్రేమతోనే బీజేపీ హిందూ నినాదం ఎత్తుకుందని, అధికారం కోసం అడ్డదారులు తొక్కుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు దుయ్యబట్టారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సెక్యులరిజం, సోషలిజం పదాలను రాజ్యాంగం నుంచి తీసివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీబీఐ, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను వారికి అనుకూలంగా మలుచుకున్నారని, ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని తూర్పారబట్టారు. ఉప రాష్ట్రపతిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పుకు బీజేపీ వక్రభాష్యం పలుకుతుందని విమర్శించారు. కమ్యూనిస్టులంటే ప్రధాని మోదీ, బీజేపీకి భయమన్నారు. భగత్ సింగ్, సుభాశ్‌చంద్రబోస్, దొడ్డి కొమురయ్య, చివరకు చాకలి ఐలమ్మ, తెలంగాణ సాయుధపోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసిందని మండిపడ్డారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఉందని, తామంత ఒకటయ్యే సమయం వస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌పై రాష్ట్రంలో రకరకాల ఊహాగానాలు సాగుతున్నాయని, బీజేపీలో విలీనం కానుందని, ఇతర చర్చలు జరుగుతున్నాయన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు పార్టీ ముందుకెళ్తుందన్నారు. సభలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, సీపీఎం, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శులు జి.ప్రభాకర్ రెడ్డి, కర్రె భిక్షపతి, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, నాయకులు నేదునూరి జ్యోతి, టి.వెంకట్రాములు, సదాలక్ష్మి, పనాస ప్రసాద్, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, వలీఉల్లాఖాద్రి, టి.విశ్వేశ్వర్ రావు, పల్లె నర్సింహ, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, అరూరి కుమార్ పాల్గొన్నారు.

## గోదావరి మీదుగా నాటు పడవలో ప్రయాణం..

- అన్నారం బ్యారేజీ 11వ గేటు వద్ద పియర్‌ను తాకి పడవ బోల్తా
- ఒకరి గల్లంతు..మరొకరు సురక్షితంగా బయటకు..
- పడవ కొనుగోలు చేసి ప్రయాణం చేసిన ఇద్దరు మత్స్యకారులు
- ఇద్దరు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ వాసులు
- గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న జాలర్లు, పోలీసులు





ప్రాణాలతో బయటపడ్డ కృష్ణస్వామి, అన్నారం బ్యారేజీ 11వ పియర్ వద్ద బోల్తా పడిన నాటు పడవ

**కాళేశ్వరం:** జీవనోపాధి కోసం చేపలు పట్టేందుకు నాటుపడవ కొనుగోలు చేసిన ఇద్దరు మత్స్యకారులు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు అధికం అవుతాయని భావించారు. అదే గోదావరి మీదుగా తమకు తెలిసిన విద్యనే కదా అని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచకు నడుపుతూ ప్రయాణం సాగించారు. దారి మధ్యలో అన్నారం బ్యారేజీ వద్ద 11 పియర్‌కు తట్టుకొని ప్రవాహంలో పడవ బోల్తాపడడంతో ఒకరు గల్లంతు కాగా, మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన జయశంకర్‌భూపాలపల్లి–మంచిర్యాల జిల్లాల మధ్యలో గోదావరిపై నిర్మించిన అన్నారం బ్యారేజీలో సోమవారం జరిగింది. చెన్నూర్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ సమీపంలో మండలపురానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు గద్దం వెంకటేష్(46), తూముకూరి కృష్ణస్వామిలు మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం పొక్కూర్‌లో చౌంక సంపత్ వద్ద నాటు పడవ కొనుగోలు చేశారు. అక్కడ ఓ టాటాఏస్‌ను కిరాయి నిమిత్తం అడుగగా అధికంగా చెప్పడంతో..చేసేదేమి లేక అదే గోదావరిపై నాటుపడవను నడుపుకుంటూ అన్నారం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. సుందరశాలవైపు బ్యారేజీలోని 11వ పియర్ వద్ద ప్రవాహం అధికంగా కొనసాగుతుండడంతో అందులోంచి బయటకు దాటే క్రమంలో పడవ బోల్తాపడి వెంకటేష్ గల్లంతయ్యాడు. కృష్ణస్వామి ఈత కొడుతు దరికి చేరి ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో గల్లంతైన వెంకటేష్ కోసం పోలీసులు, జాలర్లు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వివరించారు. గల్లంతైన వ్యక్తి అవసరాల కోసమే నాటుపడవ కొనుగోలు చేశారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కాగా, అన్నారం బ్యారేజీ పియర్ వద్ద నాటుపడవ బోల్తాపడ్డ విషయం జిల్లా వ్యాప్తంగా చర్చానీయాంశంగా మారింది.

**నిఘా లేకనే..**

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బ్యారేజీలపై ఇరిగేషన్‌శాఖ నిఘా, పర్యవేక్షణ లోపించింది. అన్నారం బ్యారేజీ గుండా గోదావరి మీదుగా గేట్ల మధ్యనుంచి నాటు పడవ సాయంతో బయటకు దాటేందుకు సాహసం చేసి ఒకరు గల్లంతయ్యే ఘటన చోటు చేసుకున్నా పట్టింపులేనితనం కొట్టచ్చినట్లు కనిపిస్తుందని ఆరోపణలు వెల్లువెత్తాయి. సోమవారం సుమారుగా 52వేల క్యూసెక్కుల ప్రవాహం తరలి దిగువకు కాళేశ్వరం వైపునకు వెళ్తోంది.

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- తండ్రిని హత్య చేసిన కుమారుడు
- ఈ ఘటనలో కొడుకు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వర్ధన్నపేట ఏసీపీ

**వర్ధన్నపేట :** తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే కారణంతో తండ్రిని హత్య చేసిన కుమారుడిని అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ ఎ. నర్సయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. వర్ధన్నపేట మండలం గుబ్బేటి తండాకు చెందిన సపావత్ సురేశ్‌కు 2019లో తాళ్లకుంట తండాకు చెందిన మౌనికతో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వివాహం జరిగిన కొద్ది కాలం వరకు కాపురం సాఫీగానే సాగింది. అనంతరం సురేశ్ మద్యానికి బానిసై భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ విషయంపై సురేశ్ తండ్రి సపావత్ రాజు(49) సర్ది చేప్పేవాడు. దీనిపై సురేశ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలుమార్లు తండ్రి రాజును కొట్టాడు. ఈ క్రమంలో సురేశ్‌కు ఓ యువతితో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలిసి సురేశ్ భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఆగస్టులో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భార్యను ఇంటికి తీసుకురాగా రాజు.. సురేశ్‌ను మందలించాడు. దీనిపై కోపోద్రికుడైన సురేశ్ తన వివాహేతర సంబంధానికి తండ్రి, భార్య అడ్డుపడుతున్నారని భావించి వారిని అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఇందులో భాగంగా ఈనెల 6న రాత్రి తన భార్య మౌనికతో గొడవ పడుతుండగా రాజు.. సురేశ్‌కు సర్ది చెప్పాలని యత్నించాడు. దీంతో ఇదే అదునుగా భావించిన సురేశ్.. తండ్రి రాజుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. అనంతరం చీరను మెడకు చుట్టి చంపి పరారయ్యారు. మృతుడి కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సోమవారం నిందితుడు సురేశ్‌ను వర్ధన్నపేట బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు సాయిబాబు, రాజు, సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

## 'ఓరుగల్లు'కు బీజేపీ మొండిచెయ్యి

**రాష్ట్ర కమిటీలో ఎవరికీ చోటివ్వని హైకమాండ్**

- సీనియర్‌లను పట్టించుకోని పార్టీ అధిష్టానం
- పార్టీ ఆవిర్భావం తర్వాత ఇదే మొదటిసారి
- ప్రతీసారి కమిటీలో ముగ్గురు నుంచి ఐదుగురు
- అధిష్టానం తీరుపై 'కాషాయం' నేతల కారాలు, మిరియాలు



**సాక్షిప్రతినిధి, వరంగల్:** భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వం ఉమ్మడి వరంగల్‌కు మొండి చెయ్యి చూపింది. రాష్ట్ర కమిటీలో ఈసారి ఒక్కరికి కూడా ఛాన్స్ ఇవ్వలేదు. సోమవారం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లకు ఉద్వాసన పలికింది. తెలంగాణ వ్యాప్తంగా కమిటీలో 8 మంది ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 8 మంది కార్యదర్శులు, ఇద్దరు కోశాధికారులు, ఒక జాయింట్ ట్రెజరర్, ఒక అధికార ప్రతినిధి కలిపి 22 మందిని ప్రకటించారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలో పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా వ్యవహరిస్తున్న సీనియర్లకు అవకాశం ఇవ్వకపోడంపై పెద్ద చర్చే జరుగుతోంది.

**మొండిచెయ్యి ఇదే మొదటి సారి..**

ప్రతీసారి రాష్ట్ర కమిటీలో ఉమ్మడి వరంగల్‌కు తగిన ప్రాధాన్యత దక్కేది. సీనియర్‌లుగా ఉన్న ముగ్గురు నుంచి ఐదుగురికి అవకాశం కల్పించిన సందర్భాలే ఉన్నాయి. బండి సంజయ్‌కుమార్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. ఆ తర్వాత వచ్చిన కిషన్ రెడ్డి కూడా సీనియర్‌లకు అవకాశం కల్పించారు. 2023, జూలై 4న బండి సంజయ్.. ఆ తర్వాత పగ్గాలు చేపట్టి జి.కిషన్ రెడ్డిలు పూర్తిస్థాయిలో రాష్ట్ర కమిటీ వేశారు. అందులో ఉమ్మడి జిల్లానుంచి డా.గుండె విజయ రామారావు (ఉపాధ్యక్షుడు), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (ప్రధాన కార్యదర్శి), ఏనుగుల రాకేష్ రెడ్డి (అధికార ప్రతినిధి, ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్నారు), చందుపట్ల కీర్తిరెడ్డి (అధికార ప్రతినిధి), జాటోతు హుస్సేన్ నాయక్ (ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు), కొండేటి శ్రీధర్ (ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు)లకు అవకాశం కల్పించారు. ఈసారి కూడా ఉమ్మడి వరంగల్‌కు రాష్ట్ర కమిటీలో సముచిత స్థానం దక్కుతుందని భావించినా.. ఒక్కరికీ కూడా అవకాశం కల్పించకపోవడంపై సీనియర్‌లు భగ్గుమంటున్నారు. 1980లో పార్టీ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర కమిటీలో జిల్లాకు ప్రాతినిథ్యం లేకుండా సందర్భం లేదని, సుమారు నాలుగున్నర దశాబ్దాల తర్వాత బహుశ ఇది మొదటిసారని పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

**ఓరుగల్లు నుంచి మహామహులు..**

బీజేపీ, జనసంఘ్.. పార్టీలకు ఉమ్మడి వరంగల్ పెద్దపీట వేసింది. బీజేపీ ఆవిర్భావం తర్వాత ఈ జిల్లాలో ఉన్నంత బలం, బలగం ఎక్కడా లేదన్న వ్యాఖ్యలు నాయకత్వం చేసిన సందర్భం. ఎంపీగా పోటీ చేసిన చందుపట్ల జంగారెడ్డి ఏకంగా పీవీ నర్సింహరావును ఓడించడం.. ఎమ్మెల్యేగా కూడా ఓసారి పార్టీ బ్యానర్ మీదే గెలిచారు. బీజేపీ నుంచి ఎమ్మెల్యేలుగా టి.రాజేశ్వర్‌రావు, జయపాల్, వన్నాల శ్రీరాములు, మార్తినేని తదితరులు గెలుపొందారు. పార్టీ అధిష్టానం కూడా ప్రతీసారి సంస్థాగత పదవుల విషయంలో వరంగల్‌కు పెద్దపీట వేస్తూ వచ్చింది. ఈసారి కూడా రాంచందర్ రావు టీమ్‌లో సీనియర్‌లకు ఛాన్స్ ఉంటుందని భావిస్తే తీవ్ర నిరాశకు గురి కావాల్సి వచ్చింది.

**రాష్ట్ర కమిటీలో సీనియర్ల ఊసేది..**

పూర్వ వరంగల్ జిల్లాలో వన్నాల శ్రీరాములు, మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, డా.టి.రాజేశ్వర్ రావులు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, రావు పద్మలలో ఎవరికీ ఈసారి కమిటీలో చోటు దక్కలేదు. అదేవిధంగా పార్టీలో సీనియర్లుగా ఉన్న ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, డా.కాశీప్రసాద్, ఎడ్ల అశోక్ రెడ్డి, చాడ శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, కోరబోయిన సాంబయ్య, గుజ్జ సత్యనారాయణరావు, గంట రవికుమార్, ముక్కెర తిరుపతిరెడ్డిలతో పాటు పలువురు కూడా రాష్ట్ర కమిటీలో పదవులు ఆశించగా.. అధిష్టానం సీనియర్‌లను విస్మరించిందన్న చర్చ పార్టీలో జరుగుతోంది.



## వైద్యరంగంలో ఫిజియోథెరపీ కీలకం

- ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు

**హన్మకొండ:** వైద్య రంగంలో ఫిజియోథెరపీ చికిత్స కీలకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా లయన్స్ క్లబ్ హనుమకొండ ఫిజియోథెరపిస్ట్ ఆవిర్భావ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోగుల ఆరోగ్య పునరుద్ధరణలో ఫిజియోథెరపీ చికిత్స కీలకమన్నారు. శరీర నొప్పులు, గాయాలు, స్ట్రోక్‌లు, శస్త్ర చికిత్సల అనంతర పునరావాసంలో ఫిజియోథెరపిస్టుల సేవలు అమూల్యమన్నారు. వీరి కృషితోనే అనేక మంది సాధారణ జీవితం గడుపుతున్నారన్నారు. వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహాయం పొందేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ వైద్యులు, విద్యార్థులను సన్మానించారు. ఫిజియోథెరపీ వైద్యులు కూడా ఎమ్మెల్యే నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఫిజియోథెరపీ వైద్యుల కమిటీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపిస్టును సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు